

12, 13 తేదీల్లో ఐలు రాష్ట్ర మహాసభలు జయప్రదం చేయాలి

తణుకు రూరల్‌: ఐలు రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని జిల్లా కార్యదర్శి కామన మునిస్వామి న్యాయవాదులకు పిలుపునిచ్చారు. సోమవారం తణుకు బార్ అసోసియేషన్ వద్ద న్యాయవాదులు మహాసభలు జయప్రదం చేయాలని కోరుతూ ప్లకార్డులు ప్రదర్శిస్తూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా కామన మునిస్వామి మాట్లాడుతూ ఈనెల 12, 13 తేదీల్లో గుంటూరులో ఐలు రాష్ట్ర 12వ మహాసభ జరుగుతుందని తెలిపారు. ఈ మహాసభలో న్యాయవాదుల సమస్యలపైన చర్చిస్తారని, న్యాయవాదుల రక్షణ కోసం చట్టం చేయాలని ప్రభుత్వానికి తీర్మానం చేస్తామని, వివిధ కోర్టుల పరిధిలో న్యాయవాదులు, మహిళా న్యాయవాదులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారంపై చర్చిస్తామని, పెండింగ్‌లో ఉన్న కేసులు సత్వరమే పరిష్కారం కోసం కక్షిదారుల తరపున కోర్టుకు తెలియజేస్తామని, ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని, న్యాయవ్యవస్థ కార్యాలయాల నిర్మాణానికి నిధులు, జూనియర్ న్యాయవాదులకు నెలకు రూ.10వేలు చొప్పున ఉపకారవేతనం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు కొర వెంకటేశ్వర్లు, డి.అప్పారావు, పులేశ్వరావు, కె.శ్రీనివాస్, వి.వెంకటకృష్ణ, డి.భాస్కర్‌రావు, ఆర్‌వి.సురేష్‌బాబు పాల్గొన్నారు.



గొమ్ముగూడెంలో సిఎం జగన్ అభివాదం

వారు చెబుతారు.. వీరు మాట్లాడతారు

అధికారులు ముందుగా నిర్ణయించినవారే సిఎం ముఖాముఖికి అనుమతి

లోపలకు వెళ్లాలంటే అధికారులు జారీ చేసిన స్లిప్పులు ఉండాల్సిందే

నిర్బంధం నడుమ గొమ్ముగూడెంలో సిఎం పర్యటన

కొండలు, గుట్టలపై ఉండే నిర్వాసితుల బాధ వినేవారే కరువు

సిఎం రాక నేపథ్యంలో గొమ్ముగూడెం వాసులకు రూ.6.37 లక్షల చొప్పున పరిహారం జమ

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

సిఎంకు నేరుగా తమ సమస్యలు చెప్పుకునే అవకాశం కొండలు, గుట్టలపై బాధలు అనుభవించేవారికి దక్కలేదు. అధికారులు ముందుగా ఎంపిక చేసి ఏం మాట్లాడాలో శిక్షణ ఇచ్చిన వారికే సిఎం వద్ద మాట్లాడే అవకాశం దక్కింది. దీంతో వారు చెప్పిందే.. వీరు మాట్లాడతారన్నట్లు పరిస్థితి తయారైంది. కుక్కునూరు మండలం గొమ్ముగూడెం గ్రామంలోని వరద బాధితులను పరామర్శించేందుకు సిఎం ఆ గ్రామంలో పర్యటించారు. మధ్యాహ్నం 1.45 గంటలకు రావాల్సిన సిఎం 3.10 గంటలకు గొమ్ముగూడెం గ్రామ సరిహద్దులో ఏర్పాటు చేసిన హెలీప్యాడ్‌కు చేరుకున్నారు. ఆయనకు మంత్రులు, ఎంఎల్‌ఎలు, అధికారులు పెద్ద ఎత్తున పుష్పగుచ్ఛాలు ఇచ్చి స్వాగతం పలికారు. అక్కడి నుంచి వాహనంపై సిఎం గొమ్ముగూడెం గ్రామానికి చేరుకున్నారు. గ్రామం పొడవునా రోడ్డుకి ఇరువైపులా బారికేడ్లు ఏర్పాటు చేయడంతో గ్రామస్తులంతా బారికేడ్ల బయటే నిలబడి ఉండాల్సి వచ్చింది. సిఎం గ్రామంలో నడుచుకుంటూ బాధితులను పరామర్శిస్తూ పలుకరిస్తూ ముందుకు నడిచారు. దాదాపు గంట సేపు సిఎం గ్రామంలో పర్యటించారు. అనంతరం తిరిగి వాహనంపై హెలీప్యాడ్ వద్దకు చేరుకుని నిర్వాసితులతో ముఖాముఖి కార్యక్రమానికి హాజరయ్యారు. నిర్వాసితులతో మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా వరద బాధితులను ప్రభుత్వం ఆదుకుందన్నారు. రెండు నెలల రేషన్ బియ్యం, ఐదు రకాల సరుకులు అందించామన్నారు. వరద నీరు చేరిన ప్రతి ఇంటికీ రూ.రెండు వేల నగదు అందించామన్నారు. దెబ్బతిన్న ఇళ్లకు సంబంధించి రూ.10 వేలు పరిహారం అందించేలా ఆదేశాలు జారీ చేశామన్నారు. కలెక్టర్ ఆ కార్యక్రమాలు సక్రమంగా చేసినట్లు స్పష్టమవుతుందన్నారు. వరద బాధితులకు సహాయక చర్యల్లో ఇబ్బందులు లేకుండా ఉండటం కోసమే తాను వారం తర్వాత వచ్చానన్నారు. కేంద్ర ప్రభుత్వం నిధులిస్తే తప్ప నిర్వాసితులకు పరిహారం అందించలేమని తేల్చేశారు. మూడు దశలో పోలవరం పూర్తి చేస్తామని, 41.15 కాంటూరు పరిధిలో గ్రామాలకు జనవరిలో పునరావాస ప్యాకేజీ ఇస్తామన్నారు. రూ.పది లక్షల పరిహారం హామీ, భూములకు ఇవ్వాల్సిన రూ.5 లక్షల హామీ జనవరి, ఫిబ్రవరి నెలల్లో అందిస్తామన్నారు. 2025 ఖరీఫ్ నాటికి పోలవరం పూర్తి చేస్తామన్నారు. కేంద్ర నిర్వహించిన లైడార్ సర్వేనే అంతిమం అంటూ తేల్చేశారు. ఈ సందర్భంగా అధికారులు ముందుగానే నిర్ణయించిన నిర్వాసితులు మాట్లాడుతూ వరద బాధితులకు వైసిపి ప్రభుత్వం గొప్పగా చేసిందంటూ సిఎం పొగడ్తలతో ముంచెత్తారు. అంతే తప్ప కొండలు, గుట్టలపై పునరావాస కేంద్రంలో ప్రతియేటా నిర్వాసితులు పడుతున్న ఇబ్బందులపై చర్చకు రాని పరిస్థితి నెలకొంది. కాంటూరు పరిధిలోని గ్రామాల్లో రోడ్లు వంటివి వేయడం లేదని, చిన్నపాటి వరదలకు మునిగిపోతున్న గ్రామాలను 41.15 కాంటూరులో చేర్చాలని మాత్రం ప్రస్తావించారు. మాట్లాడిన వారిలో వైసిపికి చెందిన కుక్కునూరుకు చెందిన నాయకురాలు, వేలేరుపాడు మండలానికి చెందిన కన్వీనర్ ఉండడం విశేషం.



అనారోగ్య బాధితుణ్ని పరామర్శిస్తున్న జగన్

నిర్బంధాల నడుమ సిఎం పర్యటన

గతంలో మాదిరిగానే నిర్బంధాల నడుమ సిఎం జగన్ పర్యటన సాగింది. మీడియాను హెలీప్యాడ్ వద్దే ఆపేశారు. సిఎం పర్యటనలో ఎక్కడా మీడియాను వెళ్లకుండా అడ్డుకున్నారు. కేవలం సమాచార శాఖ పంపించిన వార్త ఫొటోలతోనే రాసుకోవాలని చెప్పిన పరిస్థితి నెలకొంది. అంతేకాకుండా వివిధ గ్రామాలకు చెందిన నిర్వాసిత ప్రజానీకం సిఎం పర్యటనకు వచ్చినా హెలీప్యాడ్ వద్దే ఆపేశారు. అధికారులు స్లిప్పులు జారీ చేసినవారిని మాత్రమే లోపలికి అనుమతించారు. దీంతో నిర్వాసితులంతా తీవ్ర అసంతృప్తికి లోనయ్యారు. పలు గ్రామాలకు చెందిన నిర్వాసితులు సైతం సిఎం పర్యటనకు రాకుండా ముందుగానే పోలీసులు హెచ్చరికలు జారీ చేసినట్లు చెబుతున్నారు. సిఎం పర్యటన నేపథ్యంలో గొమ్ముగూడెం గ్రామానికి చెందిన 245 కుటుంబాలకు రూ.6.37 లక్షల చొప్పున పరిహారం జమ చేశారు. మరి మిగిలిని గ్రామాల వారి పరిస్థితి ఏమిటో ఒక్క మాట కూడా మాట్లాడలేదు. పోలీసు సిబ్బంది సైతం తాగునీరు, భోజనం వంటివి లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సాయంత్రం ఆరు గంటలకు నిర్వాసితులతో ముఖాముఖి ముగించుకుని సిఎం వెనుదిరిగారు. ఈ సందర్భంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఇద్దరు వ్యక్తులను నాయకులు సిఎం దగ్గరకు తీసుకెళ్లగా వారికి సాయం చేసేందుకు అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులు కొట్టు సత్యనారాయణ, తానేటి వనిత, స్థానిక ఎంఎల్‌ఎ తెల్లం బాలరాజు, మాజీ మంత్రి ఆళ్ల నాని పాల్గొన్నారు.

నదుల అనుసంధానానికి జగన్ తూట్లు


'పోలవరం' పర్యటనలో టిడిపి అధినేత చంద్రబాబు

ప్రజాశక్తి - పోలవరం

పోలవరం ప్రాజెక్టు నిర్మించి నదులను అనుసంధానం చేయడం ద్వారా రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేయాలని తాను భావించానని, ప్రస్తుత వైసిపి ప్రభుత్వం దానికి తూట్లు పొడిచిందని టిడిపి అధినేత చంద్రబాబు ఆవేదన వ్యక్తం చేశారు. సాగునీటి ప్రాజెక్టుల విధ్వంసంపై యుద్ధభేరిలో భాగంగా ఆయన జిల్లాలోని పట్టిసీమ, పోలవరం ప్రాంతాల్లో సోమవారం పర్యటించారు. తొలుత చింతలపూడి ఎత్తిపోతల పథకాన్ని సందర్శించారు. సెల్ఫీ దిగి సందడి చేశారు. అనంతరం పట్టిసీమను సందర్శించారు. అనంతరం యామిని కళ్యాణ మండపానికి చేరుకుని పోలవరం ప్రాజెక్టుపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. టిడిపి హయాంలో చేపట్టిన పనులు, వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత పరిస్థితి వివరించారు. అనంతరం పోలవరం ప్రాజెక్టు పనులను సందర్శించారు. పోలవరం ప్రాజెక్టులో స్పిల్‌వే, ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌లు, డయాఫ్రమ్ వాల్ ప్రాంతాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ మాగంటి బాబు, మాజీ మంత్రులు కెఎస్.జవహర్, దేవినేని ఉమామహేశ్వరరావు, నిమ్మకాయల చినరాజప్ప, పీతల సుజాత, ఎంఎల్‌ఎ నిమ్మల రామానాయుడు, మాజీ ఎంఎల్‌ఎ చింతమనేని ప్రభాకర తదితరులు పాల్గొన్నారు.



ప్రాజెక్టు మ్యాపును పరిశీలిస్తున్న చంద్రబాబు



చింతలపూడి ఎత్తిపోతల వద్ద సెల్ఫీ దిగుతున్న చంద్రబాబు

చంద్రబాబు పర్యటన నేపథ్యంలో పోలవరం ప్రాజెక్టు ముఖద్వారం వద్ద పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. సుమారు 200 మంది పోలీస్ బలగాలు పోలవరం ప్రాజెక్టు నుండి పట్టిసీమ వరకు మోహరించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా పోలవరం డిఎస్‌పి శ్రీనివాసులు పోలీస్ బందోబస్తు నిర్వహించారు. కన్నాపురం అడ్డరోడ్డు వద్ద పోలీసులు వాహనాలు నిలిపివేయడంతో ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు. సుమారు 8 కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. పోలవరం ప్రాజెక్టు ముఖద్వారం వద్ద పోలీస్ అధికారులు ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద కార్యకర్తలను పోలీసులు అడ్డుకున్నారు.

'నా మట్టి.. నా దేశం' స్ఫూర్తిగా కలెక్టర్ సెల్ఫీ

ప్రజాశక్తి - భీమవరం

నా మట్టి .. నా దేశం కార్యక్రమంలో భాగంగా స్థానిక కలెక్టర్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సెల్ఫీ పాయింట్ వద్ద సోమవారం జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి సెల్ఫీ దిగారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో 'నా మట్టి -నా దేశం, నేల తల్లికి నమస్కారం - వీరులకు వందనం' అనే ప్రత్యేక కార్యక్రమంలో భాగంగా ఈనెల తొమ్మిదో తేదీ నుండి 20వ తేదీ వరకు జిల్లావ్యాప్తంగా నా మట్టి.. నా దేశం కార్యక్రమాలను ఘనంగా నిర్వహించడానికి ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. అన్ని గ్రామ పంచాయతీలు, మండలాలు, పట్టణ ప్రాంతాల్లో పలు కార్యక్రమాలు. దేశ సంక్షేమం కోసం ప్రాణ త్యాగాలు చేసిన స్థానిక మహావీరులను, సాహసవంతులు, వీరులను స్మరించుకోవడం జరుగుతుందన్నారు. తొమ్మిదో తేదీన అన్ని గ్రామాలు, పట్టణాల్లో ప్రధానమంత్రి, ముఖ్యమంత్రి సందేశంతో పాటు దేశం కోసం పోరాడిన స్వాతంత్ర సమరయోధులు, త్యాగధనులు, వీరులను గుర్తు చేసుకుంటూ అమృత సరోవర్లు నీటి వనరుల వద్ద జ్ఞాపక శిలాఫలకాలను ఏర్పాటు చేసుకుని సెల్ఫీలను దిగి నిర్ణీత వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేస్తామని తెలిపారు. మట్టినిగాని మట్టి దీపాన్ని గాని చేతిలో ఉంచుకొని పంచ ప్రతిజ్ఞ చేయడం, శిలాఫలకాల చుట్టూ మట్టి దీపాలను వెలిగించడం చేయాలన్నారు. 11వ తేదీన వసుధకు వందనం పేరుతో 75 మొక్కలను నాటడం, 14వ తేదీన వీరులకు వందనం చేపట్టి మరణించిన వీరుల కుటుంబాలను, జీవించి ఉన్న వీరులను సత్కరించి ఫోటోలు అప్‌లోడ్ చేయడం, ఈనెల 16 నుండి 20వ తేదీ వరకు మండలాలు, పెద్ద మున్సిపాలిటీల్లో నిర్వహించి పెద్ద ఎత్తున ప్రచారం పలు కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందన్నారు. గ్రామపంచాయతీలు, మండలాలకు చెందిన యువత వారి ప్రాంతాల్లోని మట్టిని కళశంతో తీసుకుని ఢిల్లీకి ప్రయాణమై ఈనెల 27, 28 తేదీలలో ఢిల్లీకి చేరుకుని అక్కడ కర్తవ్యపద్‌లో జరిగే ముగింపు కార్యక్రమంలో పాల్గొనాల్సి ఉంటుందన్నారు.



సెల్ఫీ తీసుకుంటున్న కలెక్టర్ ప్రశాంతి

మున్సిపల్ కార్మికుల కలెక్టరేట్ ముట్టడి

అడ్డుకున్న పోలీసులు: నేతలతో వాగ్వివాదం

నేలపై బైఠాయించి 2 గంటలపాటు కార్మికుల నిరసన

సమస్యలు పరిష్కరించకపోతే 17న చలో విజయవాడ

సిఐటియు జిల్లా అధ్యక్షులు జెఎన్‌వి.గోపాలన్



ఆందోళన కారులను అడ్డుకుంటున్న పోలీసులు

ప్రజాశక్తి - భీమవరం

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, లేనిపక్షంలో ఈ నెల 17న చలో విజయవాడ చేపడతామని సిఐటియు జిల్లా అధ్యక్షులు జెఎన్‌వి.గోపాలన్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ప్రభుత్వాలు, పాలకులు మారినా మున్సిపల్ కార్మికుల రాతలు మారట్లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గత టిడిపి ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని, ప్రస్తుత వైసిపి ప్రభుత్వం కార్మికుల పట్ల వివక్షపూరితంగా నిర్లక్ష్యంగా వ్యవహరించడం సిగ్గుచేటని విమర్శించారు. నాడు ప్రతిపక్ష నేతగా జగన్ తన పాదయాత్రలో ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సిఐటియు ఆధ్వర్యాన మున్సిపల్ కార్మికులు కలెక్టరేట్ ముట్టడి సోమవారం నిర్వహించారు. దీనికి జిల్లా నలుమూలల నుంచి మున్సిపల్ కార్మికులు, సిఐటియు తరలొచ్చారు. స్థానిక తిరుమల విద్యా సంస్థల నుంచి కలెక్టరేట్‌కు ర్యాలీ చేపట్టారు. అయితే కలెక్టరేట్ వద్ద పోలీసులు బారికేడ్లు ఏర్పాటు చేసి ర్యాలీని అడ్డుకున్నారు. ఈ నేపథ్యంలో పోలీసులకు, సిఐటియు నేతలు, కార్మికులకు మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. కలెక్టరేట్ వద్దకు అనుమతి లేదని పోలీసులు చెప్పడంతో కార్మికులు అక్కడే బైఠాయించి ప్రభుత్వ నిర్బంధంపై నినదించారు. సుమారు రెండు గంటల పాటు కార్మికులు అక్కడే మండుటెండలో బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా గోపాలన్ మాట్లాడుతూ ఎన్నోఏళ్లుగా మున్సిపాల్టీల్లో కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ కార్మికులుగా పని చేస్తున్నా వారి సమస్యలు పట్టించుకోవడం లేదన్నారు. గత ముఖ్యమంత్రి చంద్రబాబు వారితో వెట్టిచాకిరీ చేయించారని గుర్తు చేశారు. తాను అధికారంలోకి ఇస్తే ఆరు నెలల్లో పర్మినెంట్ చేస్తానన్న ముఖ్యమంత్రి జగన్ నేడు ఎందుకు చేయడం లేదని ప్రశ్నించారు. మున్సిపల్ కార్మికులు దశలవారీగా ఆందోళనలు చేపడుతుంటే ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమన్నారు. మున్సిపల్ స్కూల్ స్వీపర్‌కు రూ.4 వేలు ఇస్తున్న జీతం ఏమాత్రం సరిపోదని, వారికి కనీస వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. వెంటనే మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, సిపిఎస్ రద్దు చేయాలని, సమాన పనికి సమానవేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో కార్మికులు నిరవధిక సమ్మెకు వెనుకాడబోరని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షులు కర్రి నాగేశ్వరరావు, కార్యదర్శి ధనాల వెంకట్రావు మాట్లాడారు. కార్యక్రమంలో శ్రామిక మహిళ జిల్లా కార్యదర్శి డి.కళ్యాణి, సిఐటియు జిల్లా కార్యదర్శి పివి.ప్రతాప్, బి.వాసుదేవరావు, నేతలు బంగారు వరలక్ష్మి, నీలాపు రాజు, నేలకు ఆదినారాయణబాబు, పొన్నాడ రాము, బంగారు, చిన్నపరెడ్డి రాజు, మాడుగుల లక్ష్మి, ఎస్‌కె.నాగూర్, నీలాపు అప్పన్న, బి.విజయలక్ష్మి, ఎం.సత్యవతి, పి.శారద, కార్మికులు పాల్గొన్నారు.

విఆర్‌ఎల సామూహిక నిరసన దీక్షలు

ఇచ్చిన హామీలు అమలు చేయాలి - సిఐటియు జిల్లా అధ్యక్షులు జెఎన్‌వి.గోపాలన్

ప్రజాశక్తి - భీమవరం

వైసిపి ప్రభుత్వం అధికారం చేపట్టి నాలుగేళ్లు దాటినా ఇచ్చిన హామీ అమలు చేయకుండా విఆర్‌ఎలను మోసగిస్తోందని సిఐటియు జిల్లా అధ్యక్షులు జెఎన్‌వి.గోపాలన్ విమర్శించారు. గ్రామ రెవెన్యూ సహాయకులు (విఆర్‌ఎ) ఎన్నో ఏళ్ల నుంచి సమస్యలతో సతమతమవుతున్నారని, వారి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. స్థానిక కలెక్టరేట్ ఆవరణలో విఆర్‌ఎలు చేపట్టిన నిరసన దీక్షలను సోమవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వం విఆర్‌ఎల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని మండిపడ్డారు. విఆర్‌ఎలకు ఇచ్చిన హామీ మరిచి నాలుగున్నరేళ్లుగా వైసిపి ప్రభుత్వం మూగనోములో ఉందని, కనీసం చర్చించడానికి కూడా చొరవ తీసుకోకపోవడం దారుణమని అన్నారు. గత ప్రభుత్వం ఇచ్చిన డిఎను సైతం తొలగించి రాష్ట్ర ప్రభుత్వం తన దుర్మార్గ వైఖరి చాటుకుందని విమర్శించారు. నేటికీ భూమిశిస్తు వసూలు, రెవెన్యూ రికార్డులు వంటి అంశాల్లో విఆర్‌ఎల పని చాలా కీలకమైందన్నారు. సిఐటియు జిల్లా కార్యదర్శి పివి.ప్రతాప్ మాట్లాడుతూ సమస్యలు పరిష్కారం కావాలంటే ఈ ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపడం తప్ప మరోమార్గం లేదన్నారు. సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు ఎం.ఆంజనేయులు మాట్లాడుతూ విఆర్‌ఎల సహనాన్ని రాష్ట్ర ప్రభుత్వం పరీక్షిస్తుందన్నారు. భూసర్వేలోను, శిస్తు వసూళ్లను, ప్రభుత్వం నిర్వహించే వివిధ సభలు సమావేశాల్లోనూ, వరదలు, వర్షాల సందర్భంలోనూ విఆర్‌ఎలను ఉపయోగిస్తూనే వారు చేసే పనేమీ లేదని తప్పుడు ప్రచారం చేస్తుందని దుయ్యబట్టారు. తహశీల్దార్ కార్యాలయాల్లో నైట్‌వాచ్‌మెన్, అటెండర్ పోస్టులను భర్తీ చేయకుండా ఆ పోస్టుల్లో నిబంధనలకు విరుద్ధంగా విఆర్‌ఎలతో పని చేయిస్తుందని విమర్శించారు. ఇప్పటికైనా విఆర్‌ఎల సమస్యలపై చర్చలు జరిపి పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమానికి విఆర్‌ఎల జిల్లా అధ్యక్షులు రావు అధ్యక్షత వహించి మాట్లాడుతూ రెండు రోజుల నిరసన దీక్షలు దిగ్విజయంగా నిర్వహిస్తామని, రాష్ట్ర ప్రభుత్వం దిగొచ్చేవరకు తమ పోరాటం ఆగదని అన్నారు. వచ్చే నెలలో అమరావతిలో నిరసన కార్యక్రమం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పిల్లి సుబ్బారావు, నేతలు బివిఎవి.పండు, మోషేను, నాని, వెంకట్రావు, సింహాద్రి, మల్లయ్య, గుమ్మళ్ల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



నిరసన కార్యక్రమంలో మాట్లాడుతున్న గోపాలన్

టెంట్ ఏర్పాటుకు అనుమతివ్వని పోలీసులు

తమ సమస్యల పరిష్కారం కోరుతూ రెండు రోజుల నిరసన దీక్షలు చేపట్టిన విఆర్‌ఎలు కలెక్టరేట్ ఆవరణలో టెంట్ ఏర్పాటు చేసుకునేందుకు పోలీసులు అనుమతించలేదు. కలెక్టరేట్ ఆవరణలో అనుమతి లేదని, అవసరమైతే కలెక్టరేట్ బయట ఏర్పాటు చేసుకోవాలని పోలీసులు స్పష్టం చేశారు. కలెక్టరేట్ ఆవరణలో విశాలమైన ఖాళీ స్థలం ఉండగా టెంట్ బయట ఏర్పాటు చేసుకోమని చెప్పడం అన్యాయమని పోలీసులను విఆర్‌ఎలు ప్రశ్నించారు. అయినా సరే పోలీసులు అనుమతి ఇవ్వకపోవడంతో స్థానికంగా ఉన్న పిచ్చి మొక్కల మధ్య విఆర్‌ఎలు కూర్చుని నిరసన దీక్షలు ప్రారంభించారు.

సాగునీరందక వరి చేలలో నెర్రలు

తహశీల్దార్ కార్యాలయం వద్ద రైతుల ఆందోళన

ప్రజాశక్తి - కాళ్ల

ఉప్పుటేరు తీర ప్రాంతంలో వరిసాగుకు వచ్చే నీటిని ఆక్వా చెరువులకు మళ్లించడంతో శివారు భూములకు సాగునీరు అందక అన్నదాతలు నానావస్థలు పడుతున్నారు. కాళ్ల గ్రామంలో నాట్లు వేసిన వరి పొలాలకు తీవ్ర నీటి ఎద్దడి నెలకొని నెర్రలు తీస్తున్నాయి. చుట్టూ నీరున్నా.. అవి సాగుకు పనికి రావని, ఉప్పగా ఉంటాయని.. రైతులు దిగులు చెందుతున్నారు. కె.లంక ప్రధాన పంట కాల్వకు ఇరువైపులా ఆక్వా సాగు ఉండడం కారణంగానే శివారు భూములకు సాగు, తాగు నీరందడం లేదని రైతులు, ప్రజలు తహశీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం ఆందోళన చేపట్టారు. పంట పొలంలో రైతులు నిరసన వ్యక్తం చేశారు. శివారు ప్రాంతాలకు సాగు, తాగు నీరు అందేలా చర్యలు చేపట్టాలని గ్రామ రైతులు, గ్రామ ప్రజలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాలను ఆయా అధికారులకు అందించారు.

ఓటర్ల జాబితా పారదర్శకంగా ఉండాలి : కలెక్టర్

ప్రజాశక్తి - భీమవరం

ఓటర్ల జాబితా ఇంటింటా పరిశీలన నూరు శాతం పారదర్శకంగా జరగాలని, ఎన్నికల విధుల్లో వాలంటీర్లను భాగస్వాములు చేస్తే సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ పి.ప్రశాంతి ఎన్నికల అధికారులను హెచ్చరించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో ఓటర్ల జాబితా సమగ్ర సవరణపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఓటర్ల జాబితా సంక్షిప్త సవరణను ప్రాధాన్యత అంశంగా తీసుకొని ఈనెల 21వ తేదీలోగా పూర్తి చేయాల్సి ఉందన్నారు. ఇంటింటి పరిశీలన కార్యక్రమం వేగవంతం చేయాలన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్

ఓటర్ల జాబితాపై వివరణ ఇవ్వాలి

వారానికి ఒకసారి తప్పనిసరిగా రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించి ఓటర్ల జాబితా గురించి వివరించాలన్నారు. ఏమైనా అభ్యంతరాలుంటే వారి నుండి తీసుకుని విచారించి తగిన విధంగా పరిష్కరించాలన్నారు. మురికివాడలో సంచారజాతులు, ఎస్‌సి, ఎస్‌టి ప్రజలు ప్రతిఒక్కరికీ విలువైన ఓటు హక్కు కల్పించాలని అధికారులను ఆదేశించారు. యువ, వలస ఓటర్లపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని తెలిపారు.

విద్యార్థులకు ఉద్యమ స్ఫూర్తి ఉండాలి

శ్రామిక మహిళ జిల్లా కార్యదర్శి కల్యాణి

ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యాన మణిపూర్‌లో అల్లర్లు, కారణాలపై సెమినార్

ప్రజాశక్తి - భీమవరం

సమాజంలో జరుగుతున్న అన్యాయాన్ని విద్యార్థులు ప్రశ్నించాలంటే ఉద్యమ స్ఫూర్తితో విద్యను అభ్యసించాలని శ్రామిక మహిళా జిల్లా కార్యదర్శి డి.కళ్యాణి సూచించారు. ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శ్రీ గ్రంధి వెంకటేశ్వర ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మణిపూర్‌లో జరుగుతున్న అల్లర్లు వాటి కారణాలు అంశంపై సోమవారం సెమినార్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యవక్తగా విచ్చేసిన కళ్యాణి మాట్లాడూతూ ఈశాన్య రాష్ట్రం మణిపూర్‌లో దారుణాలు జరుగుతున్నప్పటికీ కేంద్రప్రభుత్వం, ఆ రాష్ట్ర ప్రభుత్వం కనీసం నోరెత్తి మాట్లాడకపోవడం దారుణమన్నారు. జులై 16న బయటకు వచ్చిన ఒక వీడియో దేశంలో మహిళలపై జరుగుతున్న దాడులకు నిదర్శనమని కార్గిల్ యుద్ధంలో ప్రాణాలొడ్డి పోరాడిన ఒక సైనికుడు భార్యను అతి ఘోరంగా అత్యాచారం జరిగినప్పటికీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించకపోవడం దారుణమన్నారు. భారత రాజ్యాంగంలో షెడ్యూల్ 25 ప్రకారం గిరిజనులకు ప్రత్యేక హక్కులు ఉన్నాయని మణిపూర్ రాష్ట్రంలో గిరిజనులకు ఆర్టికల్ 371 సి ప్రకారం హక్కులు కల్పించిందని .ఈ ప్రభుత్వాలు ఆ హక్కులను కాల రాస్తున్నాయని మండిపడ్డారు. ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి డి.పెద్దిరాజు మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వ అలసత్వం వల్లనే మణిపూర్ లో అల్లకల్లోలం జరుగుతుందన్నారు. దేశంలో స్త్రీని దేవతగా పూజిస్తారు కానీ మణిపూర్ ఘటన ప్రపంచవ్యాప్తంగా ఎంతో మందిని చలించివేసింది కానీ కేంద్ర ప్రభుత్వం ఎలాంటి చర్యలూ తీసుకోకపోవడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. లక్షలాది మంది విద్యార్థులు చదువుకు దూరం అవుతున్న పరిస్థితి నేడు ఏర్పడిందన్నారు. ఈ కార్యక్రమంలో టౌన్ నాయకులు బి.గణేష్ డి.లక్ష్మీ రాజ్ పాల్గొన్నారు.



హాజరైన విద్యార్థులు



మాట్లాడుతున్న కల్యాణి

పోలవరం నిర్వాసితులకు పరిహారం, ప్యాకేజీ, పునరావాసానికి కేంద్రం నిధులివ్వాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యాన సోమవారం ఢిల్లీలో చేపట్టిన మహాధర్నాలో పాల్గొన్న ఏలూరు జిల్లావాసులు



మణిపూర్‌లో దారుణాలను నిరసిస్తూ శాంతి ర్యాలీలు

ప్రజాశక్తి - మొగల్తూరు

మణిపూర్‌లో దారుణాలను నిరసిస్తూ మొగల్తూరులో ఐక్యక్రైస్తవ వేదిక సభ్యులు సోమవారం శాంతిప్రదర్శన చేశారు. మణిపూర్‌లో చర్చిలపై జరుగుతున్న భౌతిక దాడులు, క్రైస్తవులపై జరిగిన అత్యాచారాలు, హత్యలకు నిరసనగా ఐక్యక్రైస్తవ వేదిక ఆధ్వర్యంలో పాతకాలువ సెంటరు నుంచి పాలపర్తివారిపేట చర్చి వరకూ ప్లకార్డులతో భారీ ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా కేంద్ర, ఆ రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దాడులను అరికట్టడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని సంఘస్థులు విమర్శించారు. క్రైస్తవ సోదరులకు మద్దతుగా స్థానిక ముస్లిము సంఘీయులు ప్రదర్శనలో పాల్గొన్నారు.

ఉండి : మణిపూర్‌లో క్రైస్తవులపై దాడిని ఫ్రీడమ్ ఫర్ ఇంటిగ్రిటీ క్రిస్టియన్ ఆర్గనైజేషన్ జాతీయ అధ్యక్షులు పీటర్ పుట్టా, స్టేట్ కన్వీనర్ మహ్మద్ ఇస్మాయిల్ తీవ్రంగా ఖండించారు. సోమవారం ఉండి పడవలవానిపేట నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకూ ఎఫ్ఎఫ్‌సిఐ, ఐపిఎ పాస్టర్ల ఆధ్వర్యంలో శాంతి ర్యాలీ నిర్వహించారు. ఇన్‌ఛార్జి తహశీల్దార్ వీరాస్వామి నాయుడుకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో పీటర్ పుట్టా, మహమ్మద్ ఇస్మాయిల్, ఎఫ్ఎఫ్‌సిఐ జిల్లా అధ్యక్షులు ఐజాక్ పాల్, పొలిటికల్ ప్రెసిడెంట్ రాజేష్ కన్నా, యోవేలు రాజు, సువార్త రాజు, చిరంజీవి, పాస్టర్లు పాల్గొన్నారు.

యలమంచిలి: మణిపూర్‌లో ఆదివాసీలపై మారణహోమాన్ని, ఆకత్యాలను నిరసిస్తూ క్రైస్తవులు, అభ్యుదయ మానవతావాదులు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో సోమవారం దొడ్డిపట్ల నుండి యలమంచిలి తహశీల్దార్ కార్యాలయం వరకూ నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో యలమంచిలి మండలంలోని 153 చర్చిలకు సంబంధించిన క్రైస్తవ సోదరులు పాల్గొన్నారు. అనంతరం కార్యాలయ సిబ్బందికి వినతిపత్రం సమర్పించారు. ఈ ర్యాలీకి సిపిఎం, సిఐటియు, ఇతర పార్టీల నాయకులు మద్దతుగా నిలిచారు. ఈ కార్యక్రమంలో యలమంచిలి మండలం పాస్టర్ ఫెలోషిప్ అధ్యక్ష కార్యదర్శులు రెవ బి.విలియం సాండర్స్, రెవ పాల్‌రాజ్, బైబిల్ సొసైటీ ఆఫ్ ఇండియా యలమంచిలి బ్రాంచ్ అధ్యక్ష, కార్యదర్శులు బ్రదర్ ఎపిపి కుమార్, పాస్టర్ శ్యామ్, ఐక్య క్రైస్తవ కార్యాచరణ కమిటీ సభ్యులు పాస్టర్ అచ్యుత్, శ్యామ్‌సన్, విల్సన్, చినబాబు, రత్నం, టి.ప్రవీణ్, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

వీరవాసరంలో రామకృష్ణమ్మ వర్ధంతి సభ

ప్రజాశక్తి - వీరవాసరం

వీరవాసరం విద్యాదాత మద్దాల రామకృష్ణమ్మ 33వ వర్ధంతిని పురస్కరించుకుని ఆయనకు సోమవారం ఘనంగా నివాళి అర్పించారు. వీరవాసరం తూర్పు చెరువు సెంటర్ వద్ద గ్రామస్తులు, వీరవాసరం హైస్కూల్, ఎస్ఎంబిటిఎవి, ఎస్ఎన్ డిగ్రీ కళాశాల వద్ద విద్యార్థులు, కళాశాల యాజమాన్యం ఆయన విగ్రహాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా విద్యాభివృద్ధికి రామకృష్ణమ్మ చేసిన సేవలు ఆయన దాతృత్వాన్ని గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో మద్దాల శ్రీను, కూనపరెడ్డి జయరాజు, కెవిఎల్, బండి శ్రీను పాల్గొన్నారు.

'శ్రీ వాసవి'లో ఇంజినీరింగ్ కౌన్సెలింగ్ హెల్ప్‌లైన్

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

తాడేపల్లిగూడెం శ్రీ వాసవి ఇంజినీరింగ్ కళాశాలలో ఇఎపిసిఇటి వెబ్ ఆప్షన్స్ నమోదు కోసం హెల్ప్ లైన్ సెంటర్‌ను సోమవారం నుంచి ప్రారంభించినట్లు కళాశాల పాలక వర్గ కార్యదర్శి చలంచర్ల సుబ్బారావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంజినీరింగ్ కౌన్సెలింగ్ కోసం రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకుని వెబ్ ఆప్షన్స్ నమోదు కోసం ఎదురు చూస్తున్న విద్యార్థులు కళాశాలకు వచ్చి తమ వెబ్ ఆప్షన్స్ నమోదు ప్రక్రియను పూర్తి చేసుకోవచ్చని తెలిపారు. తాడేపల్లిగూడెం పరిసర ప్రాంతాల విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

వడ్లవానిపాలెంలో 'ఫ్యామిలీ డాక్టర్'

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

లంకలకోడేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో వడ్లవానిపాలెంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం డాక్టర్ అడ్డాల ప్రతాప్‌కుమార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల పదో తేదీన నిర్వహించే నులి పురుగుల నివారణ కార్యక్రమంలో ఒకటి నుంచి 19 ఏళ్ల పిల్లలకు తప్పనిసరిగా ఆల్బెండజోల్ మాత్రలు అందించాలన్నారు.

ఛాంబర్ కళాశాలలో అంతర్జాతీయ వాణిజ్య దినోత్సవం

ప్రజాశక్తి - పాలకొల్లు

అంతర్జాతీయ వాణిజ్య దినోత్సవం సందర్భంగా పాలకొల్లు ఛాంబర్స్ డిగ్రీ కళాశాలలో కామర్స్, మేనేజ్‌మెంట్ డిపార్ట్‌మెంట్ వారి ఆధ్వర్యంలో సోమవారం సెమినార్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా డాక్టర్ గ్రేస్ హాజరై మాట్లాడుతూ వాణిజ్యం అభ్యసించే విద్యార్థులు మారుతున్న నూతన విద్యా విధానాలను, పరిస్థితులను గమనిస్తూ వాణిజ్యంలో సాంకేతిక మార్పులకు తగినట్టుగా తమ నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలని కోరారు. కళాశాల సెక్రటరీ కె.రామరాజు మాట్లాడుతూ వాణిజ్య అధ్యయన విశిష్టతను వివరించారు. ప్రిన్సిపల్ డాక్టర్ డి.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రపంచ అభివృద్ధిలో వాణిజ్యం పాత్ర, విశిష్టతను సూచించారు. అంతర్జాతీయ వాణిజ్య దినోత్సవం సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన పోస్టర్ ప్రజెంటేషన్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

ట్రిపుల్ ఐటికి మహదేవపట్నం విద్యార్థి

ప్రజాశక్తి - ఉండి

2023-24 సంవత్సరం ట్రిపుల్ ఐటికి మండలంలోని మహదేవపట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి బద్ది సాయికిరణ్ ఎంపికయ్యారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు సింహాద్రి రవీంద్రనాథ్ మాట్లాడుతూ ఎన్‌సిసి కోటాలో తమ పాఠశాలకు చెందిన బద్ది సాయికిరణ్ నూజివీడు ట్రిపుల్ ఐటికి ఎంపికవ్వడం అభినందనీయమన్నారు.

ఆలయాల ఛైర్మన్లకు సత్కారం

పాలకొల్లు :పాలకొల్లు యునైటెడ్ కాపు ఇంటర్నేషనల్ క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం క్షీర రామలింగేశ్వర స్వామి ఆలయంలో పెద్ద గోపురం, చిన్న గోపురం, కనకదుర్గమ్మ గుడి, వెంకటేశ్వర స్వామి దేవస్థానం ఛైర్మన్లను సత్కరించారు. ఆయా దేవస్థానాలకు వారు చేస్తున్న విశేష అభివృద్ధి, కృషిలను గుర్తించి అభినందిస్తూ చిరు సత్కారం చేశారు.

నేరాలు - ఘోరాలు

చిన్నారుల ఆచూకీ లభ్యం


చిన్నారులను తల్లిదండ్రులకు అప్పగిస్తున్న పోలీసులు

పెనుమంట్ర :మార్టేరులో అదృశ్యమైన పిల్లల ఆచూకీని పోలీసులు 24 గంటల వ్యవధిలో గుర్తించారు. ఈ ఘటనకు సంబంధించి డిఎస్‌పి రవి మనోహరాచారి సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. మార్టేరుకు ఆశాబేగం, సుభానిల్ దంపతుల కొడుకులు షేక్ రంజాన్(11), జాకిర్ హుస్సేన్(8) స్థానిక పాఠశాలలో చదువుతున్నారు. ఈనెల నాలుగో తేదీ ఉదయం యధావిధిగా స్కూల్‌కి వెళ్లిన వీరు సాయంత్రం ఇంటికి చేరుకోలేదు. అయితే వీరు సమీపంలోని నానమ్మ ఇంటికి వెళ్లి ఉంటారనుకుని ఉదయం వరకూ పట్టించుకోలేదు. మరుసటి రోజు తల్లిదండ్రులు నానమ్మ ఇంటికి ఫోన్ చేసి పిల్లల గురించి అడిగారు. అయితే వారు తమ వద్దకు రాలేదని చెప్పడంతో మధ్యాహ్నం పోలీసులకు ఫిర్యాదు చేశారు. రంగంలోకి దిగిన పోలీసులు సీసీ టివి ఫుటేజీ ఆధారంగా రాజమండ్రిలో ఉన్నట్లు గుర్తించారు. వెంటనే అప్రమత్తమై వారి వద్దకు వెళ్లి వారిని తీసుకొచ్చి తల్లిదండ్రులకు అప్పగించారు.

స్కూల్ సమీపంలో ఉండే ఓ బాలుడు వీరిని సరదాగా బయటకు తీసుకెళ్లినట్లు పోలీసులు గుర్తించారు. ఆకతాయిగా తిరుగుతున్న ఆ బాలుడు తన ఇంటిలోని రూ.వెయ్యి అపహరించి వాటితో రాజమండ్రి పారిపోయినట్లు పోలీసులు తెలిపారు. ఈ కేసు దర్యాప్తులో పాలకొల్లు ఎస్ఐ బాదం శ్రీనివాస్ బందం, పెనుమంట్ర ఎస్ఐ బి.సురేంద్రకుమార్ కీలకపాత్ర పోషించారు.

ఆలయ హుండీలో నగదు చోరీ

వీరవాసరం :మత్స్యపురిలో అడపావారి సెంటర్ వద్ద ఉన్న వినాయకుడి ఆలయంలో డిబ్బీని బద్దలు కొట్టి అందులోని నగదును గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లినట్లు గుడి నిర్వాహకులు రంగబాబు సోమవారం తెలిపారు. ఆలయానికి ఉన్న మెయిన్ గ్రిల్‌ను తాళాలను పగులకొట్టి లోపలికి ప్రవేశించిన దొంగలు డిబ్బీని బద్దలు కొట్టి అందులోని రూ.పది వేల నగదు అపహరించినట్లు చెప్పారు. సోమవారం తెల్లవారుజామున ఈ దొంగతనం జరిగి ఉంటుందని బావిస్తున్నారు. నరసాపురం పోలీసులకు పిర్యాదు చేసినట్లు తెలిపారు.

చేనేత దినోత్సవ స్ఫూర్తితో నేతన్నలను ప్రోత్సహించాలి

కలెక్టర్ ప్రశాంతి


భీమవరంలో నిర్వహిస్తున్న ర్యాలీలో కలెక్టర్ ప్రశాంతి

ప్రజాశక్తి -భీమవరం

జాతీయ చేనేత దినోత్సవం స్ఫూర్తితో నేతదారులను ప్రోత్సహించాలని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం నిర్వహించిన ర్యాలీలో కలెక్టర్ ప్రశాంతి చేనేత కార్మికులతో కలిసి పాల్గొన్నారు. ర్యాలీ స్థానిక తిరుమల విద్యాసంస్థల నుంచి జిల్లా కలెక్టరేట్ వరకు సాగింది. అనంతరం జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన చేనేత ఉత్పత్తుల స్టాల్‌ను కలెక్టర్ పరిశీలించి, వస్త్రాల వివరాలను, ధరలను అడిగి తెలుసుకున్నారు. జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జెడ్.వెంకటేశ్వర రావు, డిపిఒ మల్లికార్జునరావు, డిఇఒ ఆర్‌వి. రమణ చేనేత కార్మికులను ఉద్దేశించి మాట్లాడారు. అనంతరం చేనేత కార్మికులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా చేనేత జౌళి శాఖ ఇన్‌ఛార్జి ఎడి బి.రామయ్య, కార్పొరేషన్ డైరెక్టర్ అందే నాగభూషణం, డిఇఒ ఆర్.వెంకట రమణ, విజ్ఞాన వేదిక కన్వీనర్ రంగ సాయి పాల్గొన్నారు.

భీమవరం రూరల్ :దేశంలో లక్షల మంది చేనేత కార్మికులు ఉన్నారని, వారు ఎన్నో ఇబ్బందులతో జీవనం గడుపుతున్నారని, వారిని కాపాడాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపైనే ఉందని సిపిఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు అన్నారు. సోమవారం చేనేత జాతీయ దినోత్సవం సందర్భంగా భీమవరం హౌసింగ్ బోర్డ్ కాలనీలో మహాత్మ గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో చేతివృత్తిదారుల సమాఖ్య జిల్లా నాయకులు ఎం.సీతారాంప్రసాద్, భీమవరం పట్టణ సిపిఐ కార్యదర్శి రంగారావు, న్యాయవాది ఎం.శ్రీనివాసరావు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర వర్కింగ్ అధ్యక్షులు కిలారి మల్లేశ్వరరావు, నాగిడి శాంతమూర్తి, చాంద్ బాషా, తిరుమాని చంటిరాజు, ఫోకస్ వ్యవస్థాపక అధ్యక్షులు గొన్నాబత్తుల మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

పెనుగొండ : మండలంలోని వడలి గ్రామంలో జాతీయ చేనేత దినోత్సవాన్ని దొడ్డిపట్ల మల్లికార్జునరావును సత్కరించారు. ఈ సందర్భంగా సర్పంచి విజయలక్ష్మి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో ఎంపిటిసి సభ్యులు శ్రీరెడ్డి, గణేష్, వాసా కృష్ణవేణి, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.నరసింహమూర్తి, పంచాయితీ కార్యదర్శి శ్రీ పుల్లేటికుర్తి అచ్యుత రామకృష్ణ, చేనేత కార్మికులు, విద్యార్థులు, వడలి సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పాలకొల్లు :ఆజాదీ కా అమృత్ మహోత్సవంలో భాగంగా పాలకొల్లు జివిఎస్‌విఆర్ఎం మున్సిపల్ పాఠశాలలో సోమవారం జాతీయ చేనేత దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన జెసిఐ పాలకొల్లు రైసింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ మౌని మాట్లాడారు. అనంతరం విద్యార్థులు పోటీలు నిర్వహించి మొదటి, ద్వితీయ, తృతీయ బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో కారుమూరి సబిత, సూరిబాబు, మామిడి కౌశిక్, హెచ్ఎం రాయపూడి భవానిప్రసాద్ పాల్గొన్నారు.

తణుకు రూరల్ : మానవాళికి వస్త్రాన్ని అందించిన నేతన్న బతుకు నేడు ఆధునిక యంత్రాలతో పోటీ పడలేక ఛిద్రమైందని వేల్పూరు గ్రామ సర్పంచి విశ్వనాథం కృష్ణవేణి, ఎపి చేనేత కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బళ్ల చిన వీరభద్రరావు అన్నారు. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా స్థానిక ట్రైలర్స్ విగ్రహం వద్ద సంఘ పతాకాన్ని సర్పంచి విశ్వనాథం కృష్ణవేణి సోమవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వేల్పూరు చేనేత సహకార సంఘం మాజీ అధ్యక్షులు తాడిశెట్టి వీరభద్రుడు, గుడిమెట్ల సోమలింగం, వరలక్ష్మి, చల్ల పూర్ణయ్య, వాసా వెంకటేశ్వరరావు, ఎర్ర నరసింహరావు, కొడవటి కోట మల్లయ్య, కరేళ్ల రాంబాబు, కోట వెంకటేశ్వరరావు, రుద్రాక్షల శ్రీనివాస్ పాల్గొన్నారు.

వికలాంగుల్లో ఆత్మవిశ్వాసం నింపుతున్న సిఎం జగన్ : మంత్రి కొట్టు

తాడేపల్లిగూడెం :సిఎం జగన్ వికలాంగుల్లో ఆత్మవిశ్వాసం నింపుతూ ఆత్మస్థయిర్యాన్ని నెలకొల్పుతున్నారని డిప్యూటీ సిఎం, దేవదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. తాడేపల్లిగూడెం క్యాంపు కార్యాలయంలో సోమవారం వికలాంగులకు మూడుచక్రాల విద్యుత్ మోటార్ సైకిళ్లను ఆయన లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ప్రభుత్వ వికలాంగుల, వయోవృద్ధుల సహాయ సంస్థ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి కార్పొరేషన్ ద్వారా వికలాంగులకు అనేక ఉపయోగకరమైన కార్యక్రమాలను వైసిపి ప్రభుత్వం చేపడుతుందన్నారు. అందులో భాగంగానే ఆధునిక పరిజ్ఞానంతో కూడిన విద్యుత్ త్రిచక్ర మోటారు సైకిళ్లను కార్పొరేషన్ ద్వారా ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేస్తుందన్నారు. కార్పొరేషన్ ఛైర్మన్ ముంతాజ్ పఠాన్ మాట్లాడుతూ నియోజకవర్గానికి పది చొప్పున రాష్ట్రవ్యాప్తంగా 175 నియోజకవర్గాలకు 1750 వాహనాలను వికలాంగులకు పంపిణీ చేస్తున్నామన్నారు. ఇప్పటికే 1200 వాహనాల పంపిణీ పూర్తయిందన్నారు. రూ.1.20 లక్షల ఖరీదైన ఈ వాహనాన్ని ప్రభుత్వం ఉచితంగా అందజేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో వికలాంగుల కార్పొరేషన్ డైరెక్టర్ అనుపతి వెంకటయ్య, రాష్ట్ర పట్టణ ప్రాంత ఆర్థిక, మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ డైరెక్టర్ వి.కల్యాణి, ద్వారకాతిరుమల దేవస్థాన ట్రస్ట్ బోర్డు సభ్యులు ముప్పిడి సంపత్ కుమార్, వైసిపి పట్టణ అధ్యక్షులు గుండుబోగుల నాగు, పెంటపాడు ఎంపిపి దాసరి హైమావతి, పెంటపాడు ఎంపిటిసి రెడ్డి సూరిబాబు, బొద్దాని శ్రీనివాస్, కోడే సత్య శ్రీనివాస్ పాల్గొన్నారు.

గద్దర్ మృతి ప్రజా ఉద్యమాలకు తీరని లోటు

ప్రజాశక్తి - భీమవరం

ప్రజా గాయకుడు గద్దర్ మృతి ప్రజా ఉద్యమాలకు తీరని లోటని దళిత ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు గంటా సుందర్ కుమార్, సిపిఐ జిల్లా నాయకులు చెల్లబోయిన రంగారావు, పట్టణ పౌర సమాఖ్య జిల్లా కన్వీనర్ ఎం.వైకుంఠరావు అన్నారు. స్థానిక సిఐటియు కార్యాలయంలో దళిత ప్రజా సంఘాల ఆధ్వర్యంలో గద్దర్ చిత్రపటానికి పూలమాలవేసి సోమవారం ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.క్రాంతిబాబు, సిఐటియు నాయకులు ఇంజేటి శ్రీనివాస్, దళిత నాయకులు ఏలేటి సునీల్ కుమార్ పాల్గొన్నారు.

ఉద్యమ బిడ్డ గద్దర్ అని, ఆయన మృతి బాధాకరమని సాహితీ స్రవంతి జిల్లా కన్వీనర్ ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు చైతన్య ప్రసాద్, షేక్ వలీ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విప్లవ కవి గద్దర్ మరణానికి సంతాపం తెలిపారు. జననాట్యమండలి వ్యవస్థాపకుల్లో ముఖ్యులైన గద్దర్ ప్రజా సమస్యలపై పోరాడటమే కాకుండా తనదైన పాటలతో అందరినీ ఉత్తేజ పరిచేవారని గుర్తు చేశారు.

వీరవాసరం :ప్రజాగాయకుడు గద్దర్‌కు ఆయన అభిమానులు నివాళి అర్పించారు. వీరవాసరం తూర్పు చెరువు సెంటర్ వద్ద గద్దర్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళి అర్పించారు. తన గళంతో పేదల పక్షాన్న పోరాడిన గద్దర్ మృతి తీరని లోటని పలువురు వక్తలు అన్నారు. ఈ కార్యక్రమంతో తాడి రాజశేకర్, గొట్టుముక్కల ప్రభాకర్, వీరవల్లి రామకృష్ణ, వర్థినీడి భాస్కరరావు పాల్గొన్నారు.

పాలకొల్లు : గద్దర్ మృతి దళిత వర్గానికి తీరని లోటని అంబేద్కర్ సాహితీ వేదిక రాష్ట్ర అధ్యక్షులు కోలాటి పెద్దిరాజు అన్నారు. అతి సామాన్య పేద కుటుంబంలో జన్మించి, ఇంజినీరింగ్ వరకూ చదివి బ్యాంకు ఉద్యోగంలో చేరినప్పటికీ సామాజిక విప్లవ ఉద్యమం పట్ల ఆకర్షితులయ్యారని చెప్పారు.

పెంటపాడు : విప్లవ కవి ప్రజా గాయకుడు గద్దర్ మృతికి సిపిఎం జిల్లా సెక్రటేరియట్ సభ్యుడు చింతకాయల బాబూరావు ప్రగాఢ సంతాపం తెలిపారు. గద్దర్ తన ఆట పాట కళారూపాల ద్వారా అట్టడుగు వర్గాలకు చెందిన గ్రామీణ ప్రాంత ప్రజలను కదిలించడంలో, భూస్వాములు, పెత్తందారుల దోపిడీకి వ్యతిరేకంగా సమీకరించడంలో ప్రముఖమైన పాత్ర వహించారన్నారు.

'స్పందన'కు 18 ఫిర్యాదులు

ప్రజాశక్తి - భీమవరం రూరల్

స్థానిక డిఎస్‌పి కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 18 ఫిర్యాదులు వచ్చినట్లు జిల్లా అడిషనల్ ఎస్‌పి ఎవి.సుబ్బరాజు తెలిపారు. ఫిర్యాదులన్నిటిపై చట్ట ప్రకారం విచారణ జరిపి, ఫిర్యాదుదారుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత పోలీసు అధికారులతో సుబ్బరాజు ఫోన్‌లో మాట్లాడి ఆదేశాలు జారీ చేశారు.

రాష్ట్ర ప్రధానోపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షునిగా వెంకటరమణ

తణుకు రూరల్ :రాష్ట్ర ప్రధానోపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షునిగా నేలపాటి వెంకటరమణ ఎన్నికయ్యారు. 1983లో ఉపాధ్యాయ వృత్తిలోకి ప్రవేశించిన నేలపాటి వెంకటరమణ 2013లో ప్రధానోపాధ్యాయులుగా బాధ్యతలు స్వీకరించారు. వృత్తి పట్ల, బోధన పట్ల ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ అభివృద్ధి దిశగా పనిచేశారు. వేసవి సెలవుల్లో ఎన్రోల్మెంట్ కోసం (పిల్లలను పాఠశాలల్లో చేర్పించటం) డ్రాపవుట్ నిర్ధారణ కోసం కృషి చేశారు. ఆయన సేవలను గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం 2019లో సిఎం చేతులమీదుగా రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందింది. ఇవే కాకుండా అనేక ప్రభుత్వ అవార్డులు, స్వచ్ఛంద సంస్థల నుంచి అవార్డులు పొందారు. 2021లో రాష్ట్ర విద్యా పరిశోధనా మండలి(ఎస్‌సిఇఆర్‌టి) అమరావతిలో ఎనిమిదో తరగతి సాంఘిక శాస్త్ర పాఠ్య పుస్తక రచయితగా పనిచేశారు. అనంతరం ఎన్‌సిఇఆర్‌టికి సంబంధించి కరికులం ఫ్రేం వర్క్‌లో భాగంగా వర్క్‌షాపులో పాల్గొన్నారు. ఉపాధ్యాయ సంఘాల్లో వివిధ స్థాయిల్లో పనిచేసి అనేక ఉద్యమాల్లో పాల్గొన్నారు. ప్రస్తుతం ఎపి ప్రధానోపాధ్యాయ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షునిగా పని చేస్తున్నారు. ఆదివారం భీమవరం పిఎస్ఎం బాలికోన్నత పాఠశాలలో జరిగిన ఎపి రాష్ట్ర ప్రధానోపాధ్యాయ సంఘ జిల్లా శాఖ ఎన్నికల్లో జిల్లా అధ్యక్షునిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి

పోడూరు :సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని సిఐటియు నాయకులు పిల్లి ప్రసాద్ డిమాండ్ చేశారు. సిఐటియు మండల కమిటీ సమావేశం వడ్డాది ఆరోహణ కుమార్ అధ్యక్షతన సోమవారం శెట్టిబలిజ రామాలయం వద్ద సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ బిజెపి పాలనలో ప్రస్తుతం ఉన్న కార్మిక చట్టాలను తుంగలో తొక్కి కొత్త చట్టాలను తీసుకొచ్చి ఉద్యోగ కార్మికులను కట్టుబానిసలుగా చేసి పనిభారం పెంచుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి బి.ప్రకాశరావు, నాయకులు సాయిలక్ష్మి, అమ్మాజి, రాయుడు, కుమారి పాల్గొన్నారు.

కలవపూడి సొసైటీ ఛైర్మన్‌గా గంటయ్య


పివిఎల్‌కు, గంటయ్యకు గజమాలతో సత్కారం

ప్రజాశక్తి - కాళ్ల

కలవపూడి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం ఛైర్మన్‌గా బర్రె గంటయ్య, సభ్యులుగా పి.దుర్గాప్రసాదరాజు, యాళ్ల నందమ్మ ప్రమాణ స్వీకారం చేశారు. సోమవారం కలవపూడి పిఎసిఎస్ కార్యాలయం వరకు పెద్దఎత్తున ఆయన అభిమానులు, కుటుంబ సభ్యులు, పార్టీ కార్యకర్తలు ర్యాలీ నిర్వహించారు. డిసిసిబి ఛైర్మన్ పివిఎల్.నరసింహరాజు ఆధ్వర్యంలో ఈ ప్రమాణ స్వీకారం నిర్వహించారు. ఈ సందర్భంగా బర్రె గంటయ్య మాట్లాడుతూ ఈ పదవి తనకు ఇచ్చినందుకు పివిఎల్ నరసింహరాజుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యులు పచ్చిగోళ్ల సోమేశ్వరరావు, ఎంపిపి శిరీష విశ్వనాథరాజు, నరసాపురం మున్సిపల్ ఛైర్ పర్సన్ బర్రె వెంకటరమణ జయరాజు, సొసైటీ సిఇఒ కనుమూరి రామ వెంకట సత్య నరసింహరాజు(మణి), సొసైటీ సిబ్బంది, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చేనేత రిజర్వేషన్లు అమలు చేయాలని నిరసన

ప్రజాశక్తి - నరసాపురం టౌన్

జాతీయ చేనేత కార్మిక దినోత్సవం సందర్భంగా వీవర్స్ యునైటెడ్ ఫ్రంట్, ఎపి చేనేత కార్మిక సంఘం ఆధ్వర్యంలో స్థానిక శివాలయం సెంటర్‌లోని గాంధీ విగ్రహం వద్ద సోమవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతరం విగ్రహానికి చేనేత నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వీవర్స్ యూనిటెడ్ ఫ్రంట్ వర్కింగ్ ప్రెసిడెంట్ బీరక ప్రసాద్, జిల్లా కన్వీనర్ కనకం వరప్రసాద్ మాట్లాడుతూ ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన జాతీయ ఉద్యమంలో చారిత్రకపాత్ర పోషించిన చేనేత వృత్తి నేడు కష్టాల కడలిలో చిక్కుకుని విలవిల్లాడుతోందన్నారు. ఉద్యమం ద్వారా సాధించుకున్న చేనేతకు 11 రకాల వస్త్రాల రిజర్వేషన్ చట్టాన్ని సక్రమంగా అమలు చేయకుండా, చట్టాన్ని ఉల్లంఘించిన వారిపైన చర్యలు తీసుకోకుండా చేనేత కార్మికులను ప్రభుత్వాలు మోసం చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. చేనేత వస్త్రాల నిల్వలను ప్రభుత్వం కొనుగోలు చేయాలని, నేతన్న నేస్తం పథకాన్ని ప్రతి కార్మికునికీ, ఉపవృత్తుల కార్మికులకు వర్తింపజేయాలన్నారు. ఎపి చేనేత కార్మిక సంఘం జిల్లా నాయకులు బూడిద జోగేశ్వరరావు, దేశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ చేనేతపైన జిఎస్‌టిని పూర్తిగా రద్దు చేయాలన్నారు. ప్రతి చేనేత కార్మిక కుటుంబానికి మూడు సెంట్ల స్థలం మంజూరు చేసి హౌస్ కమ్ వర్క్ షెడ్ నిర్మించాలన్నారు. చేనేత కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు వాసా రామలింగం, బళ్ల భవానిప్రసాద్ మాట్లాడుతూ ఆప్కో ఆస్తులు అన్యాక్రాంతం కాకుండా పరిరక్షించాలన్నారు. నెల్లూరులో ఏడు ఎకరాల ఆప్కో స్థలం ఆప్కోకే దక్కాలని, అన్యాక్రాంతానికి పాల్పడిన అధికారులపై చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సమతం చిన్న, రాపర్తి సత్యనారాయణ, సమతం బుల్లోడు, దుర్గాప్రసాద్, బళ్ల రమేష్‌కుమార్ పాల్గొన్నారు.


నేటి నుంచి పంచాయతీ ఉప ఎన్నికలకు నామినేషన్లు

ప్రజాశక్తి - ఆకివీడు

పంచాయతీ ఉప ఎన్నికల నామినేషన్లకు మండలంలో ఎంపిడిఒ వాణి సోమవారం సాయంత్రం నోటిఫికేషన్ విడుదల చేశారు. మండలంలో రెండు గ్రామాల్లో మూడు వార్డులకు ఉప ఎన్నికలు నిర్వహించేందుకు నోటిఫికేషన్ జారీ అయిందని తెలిపారు. కుప్పనపూడిలో రెండు, ఏడు వార్డులకు, అజమూరు పదో వార్డుకు ఎన్నిక జరుగుతుందని తెలిపారు. ఈ నెల 8, 9, 10 తేదీల్లో నామినేషన్ స్వీకరిస్తామని, 11వ తేదీ నామినేషన్ల పరిశీలన జరుగుతుందని, ఉపసంహరణల గడువు 14వ తేదీతో ముగుస్తుందని తెలిపారు. 19వ తేదీ ఉదయం ఏడు గంటల నుంచి ఒంటిగంట వరకు ఎన్నికలు జరుగుతాయని, అనంతరం లెక్కింపు అభ్యర్థుల ప్రకటన జరుగుతుందన్నారు. ఎక్కడైనా సమస్యల తలెత్తిన చోట తిరిగి ఎన్నికల నిర్వహించాల్సి వస్తే 20వ తేదీన నిర్వహిస్తామని ఆ రోజే ప్రక్రియ మొత్తం పూర్తవుతుందని ఎంపిడిఒ తెలిపారు.

పెనుమంట్ర :ఈ నెల ఎనిమిదో తేదీ నుంచి మార్టేరు, వెలగలేరు పంచాయతీల వార్డు సభ్యుల స్థానాలకు క్యాజువల్ ఎన్నికలకు నామినేషన్ల స్వీకరణ నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ వి.పూర్ణబాబ్జి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మార్టేరులో 14వ వార్డు సభ్యురాలు జూలి మహాలక్ష్మి మతి చెందారు. వెలగలేరు పంచాయతీలోని ఏడో వార్డు సభ్యులు గుడిమెట్ల సోమిరెడ్డి గుండెపోటుతో మరణించారు. ఈ రెండు పంచాయతీల స్థానాలకు క్యాజువల్ ఎన్నికలకు నామినేషన్లు స్వీకరిస్తామని తెలిపారు.

తల్లిపాలపై అవగాహన అవసరం



ప్రజాశక్తి - పెనుమంట్ర

తల్లి పాలపై అవగాహన కలిగి ఉండాలని మార్టేరు సర్పంచి కుమారి అన్నారు. స్థానిక పంచాయతీ కార్యాలయంలో తల్లిపాల వారోత్సవాలు కార్యక్రమంలో భాగంగా తల్లి పాల ప్రాముఖ్యత గురించి గర్భిణులకు, బాలింతలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సర్పంచి మట్టా కుమారి తల్లి పాలతోనే బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యమన్నారు. తల్లి పాలతో రోగ నిరోధక శక్తి పెరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్ ఆర్.నాగలక్ష్మి, ఎఎన్ఎం కె.దుర్గమ్మ , ఎంఎల్‌హెచ్‌పి అలేఖ్య, అంగన్‌వాడీ టీచర్లు కె.అనంతలక్ష్మి, కె.ధనలక్ష్మి, పి.రామలక్ష్మి, కె.సుధారాణి, ఎన్.కళ్యాణి, వి.భాగ్యలక్ష్మి, సరస్వతి, ఎం.యజకుమారి పాల్గొన్నారు.

పెనుగొండ :పెనుగొండ మేకవారి వీధిలోని అంగన్‌వాడీ సెంటర్‌లో తల్లిపాలు వారోత్సవాలు ఐసిడిఎస్ అధికారి ఎం.విజయకుమారి ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా పెనుగొండ సర్పంచి శ్యామల సోని హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో బాలం కనకదుర్గ, ఎఎన్ఎం వాసవిదేవి, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

పోడూరు : తల్లిపాలే బిడ్డకు ఆరోగ్యమని జెడ్‌పిటిసి సభ్యులు గుంటూరి పెద్దిరాజు అన్నారు. పోడూరు ఎంపిడిఒ కార్యాలయంలో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో గర్భిణులకు, బాలింతలకు వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ కిట్లు, తల్లి పాల వారోత్సవాలు నిర్వహించారు. జెడ్‌పిటిసి సభ్యులు పెద్దిరాజు, ఎంపిపి సుమంగళి ముఖ్య అతిథులుగా హాజరై గర్భిణులకు, బాలింతలకు వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ కిట్లు అందించారు. ఈ కిట్లను గర్భిణులు, బాలింతలు పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకునేలా అంగన్‌వాడీ టీచర్లు, ఆరోగ్య సిబ్బంది వారికి అవగాహన కల్పించాలన్నారు. తల్లి పాలలో ఎన్నో పోషక విలువలు ఉంటాయని, బిడ్డ పుట్టినప్పటి నుంచి కనీసం రెండేళ్ల వరకు బిడ్డకు తల్లి పాలు పట్టించాలన్నరు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ డి.సుహాసిని, పాలకొల్లు ఐసిడిఎస్ సిపిడిఒ సిహెచ్.ఇందిర, పోడూరు సర్పంచి సువర్ణరాజు, ఎపి సీడ్ కార్పొరేషన్ డైరెక్టర్ పోతుముడి రామచంద్రరావు, ఎంపిటిసి సభ్యులు నాగరాజు, సూపర్ వైజర్ కె.మోహన మణి, జి.హేమతులసి పాల్గొన్నారు.

పంట కోత ప్రయోగాలపై అవగాహన

ప్రజాశక్తి - పెనుమంట్ర

త్వరలో ప్రారంభమయ్యే పంట కోత ప్రయోగాలను ఎల్‌సిఐపి యాప్ ద్వారా నమోదు చేసుకోవాలని ఎఇ ఎ.జ్యోషిల చెప్పారు. తహశీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ, వ్యవసాయ శాఖ సమన్వయంతో పంట కోత ప్రయోగాలపై విఆర్ఒ, విఎఎ, ఎఇఒలకు సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జ్యోషిల మాట్లాడుతూ ఒక్కో యూనిట్‌కు నాలుగు ప్రయోగాలుంటాయన్నారు. మొత్తం మండలంలో ఆరు ప్రయోగాలు ఉంటాయన్నారు. 250 ఎకరాలు ఎక్కువగా ఉన్న వాటిని యూనిట్‌గా పరిగణిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ ఏలియమ్మ, ఎఎస్ఒ అశోక్‌కుమార్ పాల్గొన్నారు.

పాలకొల్లులో 'భవిష్యత్తుకు గ్యారెంటీ'

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు 24, 25 వార్డుల్లో టిడిపి నేతలు సోమవారం భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మినీ మేనిఫెస్టోలోని పథకాలను మహిళా నాయకులు సమావేశాలు నిర్వహించి వివరించారు. అనంతరం ఇంటింటికి తిరిగి కరపత్రాలను పంచారు. ఈ కార్యక్రమంలో కర్నేని రోజారమని, పెండ్యాల భవాని, దేవగానుగుల వరలక్ష్మి, సంగుల విజయలక్ష్మి, నియోజకవర్గ పరిశీలకులు పెచ్చెట్టి చంద్రమౌళి, పెచ్చెట్టి బాబు, గండేటి వెంకటేశ్వరరావు, చామంతుల సత్యనారాయణ, అల్లం నరసింహస్వామి పాల్గొన్నారు.

పాలకొల్లు రూరల్ : మండలంలోని దిగమర్రు, కోతపేట గ్రామాల్లో సోమవారం మహాశక్తి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు కర్నేని రోజారమణి మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు ప్రకటించిన మేనిఫెస్టోలో మహాశక్తి పేరుతో మహిళలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మండల మహిళా అధ్యక్షురాలు ద్రాక్షారపు జ్యోతి, పాల విజయకుమారి, ఆకుల ధనలక్ష్మి, పితాని జాన్సీరాణి, తాళ్లూరి విజయలక్ష్మి, పరువు సుజాత, గూడూరి భవాని పాల్గొన్నారు.

9న మహాధర్నాను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను ప్రతిఘటిస్తూ, కార్మికవర్గం పోరాటం ఉధృతం చేస్తూ, రానున్న ఎన్నికల్లో మోడీని గద్దె దింపుతుందని ఎఐటియుసి రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.సోమసుందర్ హెచ్చరించారు. క్విట్ ఇండియా ఉద్యమస్ఫూర్తితో ఈ నెల 9వ తేదీన దేశవ్యాప్తంగా జరగనున్న కార్మికవర్గ మహాధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. మహాధర్నా డిమాండ్లను ప్రచారం చేస్తూ ఎఐటియుసి తాడేపల్లిగూడెం ఏరియా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి ఏరియా కమిటీ కార్యదర్శి ఓసూరి వీర్రాజు, భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షుడు పడాల శ్రీనివాస్, యూనియన్ జిల్లా కోశాధికారి మెండెం జేమ్స్ పాల్గొన్నారు.

యలమంచిలి :మణిపూర్ బాధితులకు మద్దతుగా ఈ నెల 9వ తేదీన భీమవరం కలెక్టరేట్ వద్ద జరిగే మహాధర్నాను జయప్రదం చేయాలని సిఐటియు మండల కార్యదర్శి దేవ సుధాకర్ పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమవారం స్థానిక పిహెచ్‌సి వద్ద ఆశా కార్యకర్తలతో కలిసి నిరసన తెలిపరు. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ తొమ్మిదో తేదీన భీమవరం కలెక్టరేట్ వద్ద జరిగే క్విట్ మోడీ, క్విట్ కార్పొరేట్ కార్యక్రమంలో ప్రతిఒక్కరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పి.కమల, ఆర్.సునిత, కల్పన, రత్నకుమారి, రాజేశ్వరి, రామలక్ష్మి, లక్ష్మీప్రసన్న, శ్రీలక్ష్మి పాల్గొన్నారు.